క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



గుర్తింపు యూనియన్ నాయకులను సత్కరిస్తున్న సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: ఈ నెల 18వ తేదీన జరిగిన హిందూస్థాన్ షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నాయకులు సోమవారం సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం డైరెక్టర్ (సి.పి) జె.పి.గుప్తా, డైరెక్టర్ (యస్.బి) కుంజుమన్ ఈ మాథ్యూ, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్.వి.రాంబాబులను యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.యస్.ఆర్.మూర్తి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఔషధ మొక్కలు నాటాలి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మొక్క నాటుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ఔషధ గుణాలు కలిగిన మొక్కలు విరివిగా నాటాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం మద్రిపాలెం వుడా లే అవుట్ నూతన పార్కులో హరితహారం కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో కలసి ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధ గుణాలు కలిగిన తులసి, రావి, వేప, మారేడు, మద్రి, అశోక, చందనం, వెదురు, జమ్మి, మామిడి వంటి మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలు నాటి, వాటిని పరిరక్షించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రత్నం, సన్యాస అప్పారావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలో యోగా తరగతులు



యోగాసనం వేస్తున్న విద్యార్థినులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు యోగా గురువు ప్రకాష్ యోగాలో మెలకువలను నేర్పించారు. ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుపై దృష్టి సారించగలరన్నారు. అందుకే, రోజూ 30 నిమిషాల పాటు యోగా తరగతులు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



నిరసనలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

మల్కాపురం: ఏళ్ల తరబడి పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. 60వ వార్డు గుల్లపాలెంలోని వార్డు శానిటరీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. గడిచిన ఎన్నికల్లో తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని దాని ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని కోరారు.

ప్రజారోగ్యానికి భరోసా





ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం... విద్య అందించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మేధావుల మాట. వారి మాటను స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. ప్రజారోగ్యానికి భరోసా కల్పించారు. నాడు- నేడు ద్వారా ఆస్పత్రుల రూపు రేఖలు మార్చారు. అవసరమైన సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించారు. ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

- గోపాలపట్నం సీహెచ్‌సీకి మహర్దశ
- అందుబాటులోకి అధునాతన సౌకర్యాలు
- విస్తృతమైన వైద్య సేవలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రోగులు



వైద్య సేవలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఒకప్పుడు జ్వరం వచ్చినా ప్రైవేటు వైద్యుడి వద్దకు పరుగులు తీయాల్సిందే.. పేదరికం వెంటాడినా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అప్పులు చేసి మరీ దూరాభారంలో ఉన్న ప్రైవేటు వైద్యులు.. ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిందే.. అలాంటి పరిస్థితికి చెక్ పెట్టారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వ వైద్యానికి చికిత్స చేశారు. నాడు- నేడుతో ఆస్పత్రులను అభివృద్ధి చేసి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. వార్డు స్థాయిలో అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సీహెచ్‌సీల్లో వసతులు కల్పించారు.

కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించారు. 11మంది నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. వారికి ప్రత్యేక ఓపీ గదులు నిర్మించారు. వైద్య సేవలకు వచ్చే వారు వేచి ఉండేందుకు బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. మేల్, ఫిమేల్ వార్డులు మీటింగ్ హాలు వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నాయి.

అందుబాటులోకి నూతన వసతులు

రక్త పరీక్షల గది, ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, పిల్ల వార్డు, స్త్రీల వార్డు, పోస్టు ఆపరేషన్ వార్డు, నర్స్ రూమ్, డాక్టర్ రూమ్, నవజాత శిశు విభాగం, ఐసీటీసీ, పురుషుల వార్డు, కార్యాలయం, సమావేశ గది, డ్యూటీ నర్స్ గది, డ్యూటీ డాక్టర్ గది, సూపరింటెండెంట్ గది, రక్త నిల్వ విభాగం ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎక్స్‌రే, ల్యాబ్, పోస్టుమార్టం గది వంటి సౌకర్యాలను అభివృద్ధి చేశారు.

గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి

ప్రాంతం	: 92వ వార్డు, గోపాలపట్నం
నిర్మాణ వ్యయం	: రూ.5.50కోట్లు
వైద్యులు	: 11 మంది
వసతులు	: 25 గదులు 30 పడకలు
ఓపీ సమయం	: ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు
ఓపీ సంఖ్య	: రోజూ 250 - 300 మంది
ప్రధాన వైద్యాధికారి	: శ్రీనివాసరావు, సూపరింటెండెంట్

నాడు ఇలా ...

గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయింది. ఇందులో వైద్యులు డెప్యుటేషన్‌పై పని చేసేవారు. కేవలం ప్రసూతి ఆస్పత్రిగా ఉండేది.అత్యవసర వైద్యం ఇక్కడ అందుబాటులో ఉండేది కాదు. మందులు కూడా అరకొరగా ఉండేవి. ఆస్పత్రికి వచ్చేవారు కూడా అంతంత మాత్రమే. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత గోపాలపట్నం ఆస్పత్రి రూపు రేఖలు మారిపోయాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి ద్వారా లక్ష మందికి వైద్య సేవలు అందించే విధంగా రూపొందించారు.

నేడు మారిన రూపురేఖలు

గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి రూపురేఖలు మారాయి. అదనపు సౌకర్యాలతో కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తోంది. స్పెషలిస్టు వైద్యులతో మెరుగైన సేవలు అందిస్తున్నారు. రూ.5.50 కోట్ల వ్యయంతో 25 గదులతో నూతన భవనం నిర్మించారు. ఓపీ గదులు, వైద్య సేవలకు వచ్చే వారికి వేచి ఉండేందుకు సౌకర్యాలు కల్పించారు. దీంతో పాటు పాత భవనంలో ఉన్న 15 గదులు వైద్య సేవలకు తగిన విధంగా కేటాయించారు.



ఓపీ వద్ద వేచి ఉన్న వ్యాధిగ్రస్తులు

వైద్యం చాలా బాగుంది



గతంలో వైద్యం కోసం ప్రైవేటు వైద్యుల దగ్గరకు వెళ్లాల్సి వచ్చేది.గోపాలపట్నం ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో ఇక్కడే వైద్య సేవల కోసం వస్తున్నాం. గైనిక్ సేవలు చాల మెరుగుపడ్డాయి. గతంలో ఇబ్బంది పడే వారం. 3 ఏళ్ల నుంచి ఎంతో మార్పు వచ్చింది. వైద్యులు వ్యాధి గ్రస్తుల పట్ల మర్యాద పూర్వకంగా చూస్తున్నారు. ప్రత్యేక గదులు ఉండడం వల్ల కేస్ స్టడీకి దోహద పడుతుంది.

–సీహెచ్ హారతి, గోపాలపట్నం

బాగా చూస్తున్నారు



కొత్తగా అభివృద్ధి చేసిన ఆస్పత్రిలో సేవలు బాగున్నాయి. వైద్యులతో పాటు నర్సులు మిగిలిన స్టాఫ్ పెరిగారు. ఓపీ తీసుకున్న తర్వాత ఏ వైద్యుడి వద్దకు వెళ్లాలో సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో మాపని సులువవుతోంది. ప్రత్యేక ఓపీ గదులు ఉండడం వల్ల డాక్టర్‌తో అన్ని విషయాలు చెప్పగలుగుతున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో ఇంత మెరుగైన వైద్యం అందేది కాదు.

–మన్మథరావు, బాజీ జంక్షన్

50 పడకలకు అప్‌గ్రేడ్



కొత్త భవనం ప్రారంభమైన తర్వాత ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది. ఇక్కడి సౌకర్యాలు 50 పడకల ఆస్పత్రికి కావాల్సిన విధంగా ఉన్నాయి. కొత్త భవనంతో పాటు పాతభవనాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నాం. రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం. వైద్య సేవలను మరింత విస్తృతం చేసి అప్‌గ్రేడ్ అయ్యేలా సమన్వయంతో పని చేస్తున్నాం. ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు వస్తే ఓపీ తాకిడి మరింత పెరుగుతుంది.

– శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, గోపాలపట్నం

హర హర శంభో



పూజలందుకున్న మహాశివుడు

గోపాలపట్నం: గోపాలపట్నం చంద్రమౌళీశ్వరాలయంలో ఉదయం నుంచి వైభవంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. నందమూరినగర్ శివాలయంలో నిర్వహించిన క్షీరాభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పద్మనాభనగర్ శివాలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



చంద్రమౌళేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కొత్తపాలెం ప్రాంతాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. వేకువజామునే ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. హరనామస్మరణ మార్మోగింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

విశాఖ విద్య: ఎస్‌ఎడీ సెంటర్‌లోని ప్రమథ ఉమావిశ్వేశ్వర సహిత కుమారస్వామి ఆలయాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దర్శించుకున్నారు. స్వామి వారి పంచామృతాభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు గొంతిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నందమూరినగర్ శివాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

మల్కాపురం: స్థానిక ఐవోసీ వద్ద గల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి భక్తులు విభూది, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.అలాగే శ్రీహరిపురం హరిహర క్షేత్రం, శ్రీహరిపురం,మల్కాపురం,ప్రకాష్‌నగర్ శివాలయాలతో పాటు గణపతినగర్‌లోని పశుపతినాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి



బీఎల్‌ఏలు, గృహసారథులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఓటర్ల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, జియ్యాని శ్రీధర్ కోరారు. బీఎల్‌ఏలు, గృహసారథులతో మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో నిర్వహించిన సమావేశంలో భాస్కరరావు మాట్లాడారు. ఓటర్ల నమోదు ఎంత ముఖ్యమో, నకిలీ ఓట్ల గుర్తింపు కూడా అంతే ముఖ్యమన్నారు. దొంగ ఓట్లపై ఎలక్షన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రహమాన్, పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు, 89, 91, 92, 52, 56, 57 వార్డుల బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

గోపాలపట్నం: గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు నందవరపు సోములు మాట్లాడుతూ నేటి యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్లపు చినఅప్పారావు, గోపాలపట్నం కళాసేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదిత్యా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్. ఆర్ రంగనాథన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీ నరసింహం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

మల్కాపురం: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఇక్కడ నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్,ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ కాలనీ గ్రంథాలయంలో

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు అందరికీ ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు వార్తా పత్రికలు అందుబాటులో ఉంటూ ఎంతో ప్రయోజనం కలిగిస్తున్నాయన్నారు. వేడుకల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి కనకరాజు, షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ నాయకుడు మీసాల సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు శామ్యూల్, శ్రీనివాసరావు, రాయల్, టీచర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



సచివాలయంలో ప్రభుత్వ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్



కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

గోపాలపట్నం: రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే ఎన్నో పథకాలను మన సీఎం అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నం–1 సచివాలయం 476లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం సమీపంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ఎంత మొత్తం మంజూరు చేసేందో తెలియజేసే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండేవిధంగా, తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టారన్నారు. ప్రతీ పేద కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మహిళలకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేశారని గుర్తు చేశారు. కళ్లు మూసుకుపోయిన ప్రతిపక్ష పార్టీ, తోక పార్టీ పస లేని విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వారి స్వలాభం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు.

పథకాలకు రూ.16.33 కోట్లు

బెహరా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రం, మన నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. ఆడారి ఆనంద్ కుమార్ పదవితో పని లేకుండా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సచివాలయ పరిధిలో రూ.16.33 కోట్లను పలు పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. అలాగే వార్డులో రహదారులు, కాల్వలు అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వరలక్ష్మి, బురెడ్డి గోపి, సురేష్, నాగూర్, కేబుల్ శంకర్, చెరుకూరి కుమార్, నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



దంపతులను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు సింధియాన్యూకాలనీలోని సోమవారం ఎక్కువ ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించిన రామారావు, జ్ఞానేశ్వరరావు దంపతులను సత్కరించారు. శివాలయంలో శ్రీను పంతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సంతోష్‌నగర్‌లో పట్టపగలే చోరీ

గోపాలపట్నం: పిల్లలను స్కూల్ నుంచి తీసుకు రావడానికి వెళ్లి వచ్చిన సమయంలోనే ఇంట్లోకి చొరబడి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన గోపాలపట్నం సంతోష్‌నగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం క్రైం ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్‌కు చెందిన చింతపల్లి తిరుమల సునందమాల బుచ్చిరాజుపాలెం భాష్యం స్కూల్‌లో చదువుతున్న పిల్లలను తీసుకు వచ్చేందుకు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. పిల్లలను తీసుకుని 5 గంటలకు ఇంటికి వచ్చింది. తాళం తెరిచి ఇంట్లోకి వెళ్లేసరికి వెనుక తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురైంది. బీరువా తాళం తెరిచి ఉంది. దీంతో బీరువాను పరిశీలించగా బంగారం కనబడక పోవడంతో పోలీసులకు సమాచారమిచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బీరువా తాళాలు అందుబాటులో ఉండడంతో బంగారం ఎత్తుకు పోయాడని చెబుతున్నారు. భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. అత్తామామ అదే ఇంట్లోని పై అంతస్తులో ఉంటున్నారు. ఈ చోరీలో గాజులు, నక్లెస్ వంటివి బంగారు ఆభరణాలు ఎనిమిది తులాలు పోయాయని బాధితురాలు చెబుతోంది. ఈ విషయం తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. సీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.